# చీకటీ-వెన్నెలా

**- ఐ. కవిత**

మద్రాసులాటి మహానగరంలో అదేమీ ఖరీదయిన బారు కిందకి రాదు. కాని.. ఆ బారులోని ఆ మూలగది మాత్రం దాని ద్వారానికి పైన తగిలించబడిన బోర్డు సూచిస్తున్నట్లు స్పెషలే.

ఆ చిన్న గది ప్రత్యేకతకు నిజమయిన కారణం దానికున్న విశాలమయిన కిటికీలోంచి దగ్గరగా ఉన్న సముద్రం కనిపించడమూ కాదు; శుక్లపక్షంలో ఆ కిటికీలోంచి చందమామ కనిపిస్తూ...లోపలికి...టేబులు మీద వెన్నెల పడడమూ కాదు. దాని ప్రాముఖ్యతకి అసలు కారణం-ఆ గదిలో ఉన్న ఒకే ఒక్క టేబుల్‌ని రోజ్ అటెండవడం!

ఔను మద్రాసులో మహిళా బార్టెండర్లున్న మామూలు బార్లు అతి తక్కువ.

రోజ్‌ది అందరికళ్లకీ అందంగా కనిపించే రూపం అయి ఉండకపోవచ్చు. నిరాడంబరంగానూ సాదాగానూ నిర్మలంగానూ ప్రశాంతత ఉట్టిపడుతున్నట్లూ ఉండడమే ఆమె సౌందర్యంలోని విశేషం కావొచ్చు. ఆమె ముఖమూ కళ్లూ ఎవరిమీదో జాలి పడుతున్నట్లూ కరుణ కురిపిస్తున్నట్లూ కనిపిస్తాయి.

బార్‌లో అలాంటి అమ్మాయి..స్మశానంలో మల్లెపూవులా..ఆడ్‌గా అనిపిస్తుంది మరి. ఆంతర్యం ఎటువంటిదయినా అతిథులకి అతి చక్కని ఆతిథ్యమూ సేవా అందిస్తుంది. ఆమె చేసే ఉద్యోగానికనువుగానే చుడీదారూ కమీజూ ధరించిందామె. అవి ఆమెకు చక్కగా అమిరి...ఆమె అందంగా కనపడుతోంది. ఆకర్షణీయంగా కూడా కనపడుతోంది.

సమయం-పదకొండుకి దగ్గరౌతూంది. బార్ మూసివేసే వేళ సమీపిస్తుంది. స్పెషల్ రూమ్ ఖాళీగా ఉంది కనుక రోజ్ కూడా తీరిగ్గానే ఉంది. ఆమె ఏదో ఆలోచనలలో ఉన్నట్లుంది.

సరిగ్గా అప్పుడు అతను!

ఆమె అయిష్టంగా..మెల్లగా లేచింది..అతను రావడం తనకెంతమాత్రమూ యిష్టం లేనట్లు. ఐతే...ఆమె తన భావాలన్నిటినీ మనసులోనే దాచుకుంది. బయటకు మాత్రం బలవంతంగా వ్యాపారాత్మక మందహాసం చిందించి అతనికి దగ్గరగా వెళ్లింది.

''శుభోదయం-'' అన్నాడతను. నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆమె నవ్వలేదు. ''అర్ధరాత్రి ఔతూంది-'' అంది. ఎంత ప్రయత్నించినా కంఠంలో కొంత కఠినత్వం మిగిలిపోగా.

అతను దెబ్బతిన్నట్లే చూశాడు. ''రోజ్! ప్లీజ్..యీవొక్కసారికీ నన్ను మనిషిలా చూడవూ?'' అతని గొంతునిండా ప్రార్ధనే. ప్రాధేయతే.

ఆమె త్రుళ్లిపడి..సర్దుకుని..''ఏమిటి మీ అభియోగం? మీరు కస్టమర్..నేను బార్టెండర్‌ని. మిమ్మల్ని చాలా మర్యాదగా చూడడం నా విధి. గతంలో..నాకు తెలియకుండా..ఎప్పుడైనా ఏదయినా పొరపాటు జరిగితే...క్షమించండి. ప్లీజ్..కూర్చోండి. ఆర్డర్ చెప్పండి. ఇదుగో కార్డ్'' అంటూ ప్లాస్టిక్ ఫోల్డర్‌ని అతని వేపు జరిపి-వినయంగా నిలుచుంది.

అతను కూర్చోలేదు ''నేను తాగడానికి రాలేదు-''

ఆశ్చర్యపోయిందామె. నమ్మలేనట్లు చూసింది.

''నాకు నీ సమయం కొంచెం కావాలి. పది.. పదిహేను నిముషాలు..అంతే. నిన్ను కలుసుకుందుకి అడ్రస్ తప్ప మరొకటి తెలియదు.'' భయంగా..తడబడుతూ చెప్పాడు.

ఆమె-వాచీ చూసుకుంది. ''ఇది బార్ టైమ్. నేను డ్యూటీలో ఉన్నాను.''

''ఔను. మరో పదిహేను నిముషాలు. నేను బయట నిరీక్షిస్తే..నాతో మాట్లాడతావా?'' ఎంతో వేడుకుంటున్నట్లే అడిగాడు.

''సారీ! మీరు నా గురించేమనుకుంటున్నారో..నేను పెళ్లికాని అమ్మాయిని..'' ఆమె కంఠంలో కొంచెం తీక్షణత.

''నేనూ పెళ్లికాని అబ్బాయినే..''

''అందుకే..'' అందామె తలవొంచుకుని.

అతను ఒక్క నిముషంలోనే చాలా ఆలోచించి నిర్ణయానికి వొచ్చినట్లు..''ఒక ఛిల్‌డ్ బీర్.'' అన్నాడు, ఆమె ముఖం వేపే చూస్తూ. ''మీరు నన్ను మరోలా భావిస్తున్నారేమో..బార్‌లో పని చేస్తున్నంత మాత్రాన బజారు దాన్ని కాను'' అని గొణుక్కుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది. అతను ఒక నిట్టూర్పు వదిలాడు. ఆమె మాటలు వినపడినట్లు.

అర నిముషంలో ఆమె బీరు బాటిలూ మగ్గూ తెచ్చి కొంచెమయినా నురగరాకుండా మగ్గులోకి బీరుని పోసి అతని ముందుంచింది.

''థాంక్స్.'' చెబుతూ ఒక సిప్ మాత్రం తీసుకుని-మగ్‌ని టేబులు మీదుంచేశాడు.

''బీరుని గల్ప్ చేస్తారు తప్ప సిప్ చేయరు-సాధారణంగా మీకు-చెప్పక్కర్లేదు కాని..''

''ఇవాళ్టి పరిస్థితి వేరులే. ఔనూ. దయచేసి కూర్చోకూడదూ?''

''సారీ! డ్యూటీలో..కస్టమరుండగా..కూర్చోడం నిషిద్ధం..''

''కనీసం-యీ గదిలోనయినా ఉండొచ్చునా నా మాటలు వింటూ?''

''మరో కస్టమర్ వొచ్చేవరకూ..''

''థాంక్స్. ఆ మాత్రమేనా దయుంచావు. రోజ్! రేపటి నుంచీ నీకు నా యిబ్బంది ఉండదులే.'' మెల్లగా అన్నాడు.

''ఏం? బార్ మార్చేస్తారా?''

''ఉహు..తాగడమే మానేస్తున్నాను-''

''నిజమయితే-చాలా శుభవార్తే.''

''నాకు తెలుసు. నేను రావడం మానేస్తే నీకు చాలా ఆనందం. నేను యివాళ వొచ్చింది నీ నుంచి వీడ్కోలు తీసుకుందుకే. కనీసం యిప్పుడయినా నిజం చెప్పు. నేనంటే నీకెందుకంత అసహ్యం?'' సీరియస్‌గా అడిగాడతను.

''అసహ్యమా! నాకా!..మీమీదా!'' తెల్లబోయిందామె. ''ఎవరు చెప్పారు అలా?''

''అసహ్యం కాకపోతే-కోపం..లేదా ద్వేషం..పోనీ అలాంటిదేదో..అదే ఎందుకని? నేను టిప్ యివ్వనని..ధనవంతుణ్ని కానని..''

ఆమె అతని మాటలకడ్డుపడింది. ''ఇచ్చే టిప్‌ని

బట్టి కాని..కస్టమర్ ధనవంతుడా కాదా అని కాని నేనాలోచించను. యజమాని నాకు జీత మిస్తారు. కస్టమర్ల ఆర్డర్లూ..వారికి నేనందించ వలసిన సేవలతోనే తప్ప వారి ఐశ్వర్యంతో నాకేం పని?'' పౌరుషంగా అందామె.

''మరెందుకు బార్‌లోకి నేను ప్రవేశించడం చూస్తూనే ముఖం అదోలాపెడతావు?''

రోజ్ ఏమీ అనలేదు. మౌనాన్నే ఆశ్రయించిందదే మేలన్నట్లు ఆ పరిస్థితిలో.

''నువ్వు నాకేమీ చెప్పవని నాకు తెలుసులే. నేను చెప్పేదయినా విను కరుణించి. సరిగ్గా ఆరు నెలల క్రిందట.. ఒక ఫ్రెండ్ పార్టీ యిస్తానని నన్ను బలవంతంగా యీ బార్‌కి తీసుకు వచ్చాడు. తాగించాడు. తాగడమూ..నిన్ను చూడడమూ కూడా అదే ప్రథమం. నువ్వు నా కంటికి పవిత్రమూ నిర్మలమూ ఐన పారిజాతం లాగే కనిపించావు చూడగానే. తొలి చూపులో ప్రేమ. నమ్ము..నమ్మకపో. నిన్ను ప్రేమించా నానాడే. సాధ్యమైనంత ఎక్కువగా నిన్ను చూడాలి. నీతో మాట్లాడాలి..నీ సమక్షంలో గడపాలి. అదే ధ్యేయమైపోయింది నాకు. పిచ్చంటేనే సబబేమో. అందుకే-బార్ తెరిచేసరికి..నీ డ్యూటి ప్రారంభమయ్యేసరికి వొచ్చేసేవాడిని. శుభోదయం పలికేవాడిని. అప్పటికే నీ గురించి చాలా తెలుసుకున్నాను.''

''మీరు ఎక్కువ తాగేవారు..ఒక్కొక్క పెగ్గే ఆర్డ్ చేస్తూ..బార్ మూసేస్తున్నామని చెప్పేవరకూ..అప్పుడేనా..విధిలేనట్లు..తూలుకుంట ూ..అయిష్టంగా కదిలేవారు-'' ఎత్తిపొడుస్తున్నట్లే అంది.

''ఔను. నీ సమక్షంలో ఎక్కువ సేపు గడపాలంటే ఎక్కువ తాగాలి కదా? నీతో ఎక్కువ మాట్లాడాలంటే ఎక్కువసార్లు ఆర్డరివ్వాలికదా? నీకు గుడ్‌నైట్ చెప్పాలంటే చాలా సేపుండాలి కదా? అదీ కాక నిన్ను చూస్తుంటే ప్రేమ నిషా! ఒక వేపు మద్యం నిషా! మరోవేపు మధురమయిన వలపు నిషా..వాళ్ళు తెలిసేది కాదు.. మస్తుగా తాగేవాడిని.''


''అదేమో కాని-ఇంత చిన్న వయసులోనే అంత ఎక్కువగా తాగే మిమ్మల్ని చూస్తూంటే నిజంగా నాకు విసుగూ కోపమూ వచ్చేవి. వాటి వెనుక జాలే అనుకోండి. ఒక్కొక్క సందర్భంలో అయితే-యిక మీకు డ్రింక్ సప్లయ్ చెయ్యనని అరిచెయ్యాలనిపించేంత కోపం-''

''కస్టమర్ తాగిన కొద్దీ నీకు కమిషన్ కదా? కోపమెందుకూ?''

''కొన్ని విషయాలు మీకర్థం కావు లెండి.''

''చెప్పొచ్చుగా తెలియని వాడికి?''

''అవి సున్నితమైన సంగతులు. అర్థం చేసుకోవాలే తప్ప చెబితే వాటి అందం చెడిపోతుంది.''




''సరే..అలాగ..ఆరునెలలపాటు నీ ప్రేమ కోసం తపస్సే చేశాను కఠోర దీక్షతో. నువ్వు గుర్తిస్తే..ఒక్క రాత్రి కూడా నేనిక్కడకి వొచ్చి తాగనిది లేదు.''

''ఔను. ఇవాళేనా మీరు రాకుండా ఉంటే బాగుండునని ఎన్నిసార్లనుకుని ఓడిపోయానో!'' నిట్టూర్చిందామె.

''చివరికి తెలుసుకున్నాను-'' విరాగిలా, నిర్లిప్తంగానూ, నిర్వేదంగానూ అన్నాడు.

''ఏమని?'' కుతూహలం ఆపుకోలేక పోయిందామె.

''నీ రూపం శిల్పంలా అందమయినది. అలాగే-నీ ఆంతర్యమూ శిలాసదృశ్యమే. దానికి ఆర్ద్రత లేదు. కరుణ లేదు. ప్రేమ లేదు. పైకి అలా సౌజన్యం మూర్తీభవించినట్లు కనిపిస్తావంతే. నా ప్రేమా ఆరాధనా తపస్సూ నిన్నేనాటికీ కదిలించనూ లేవు కరిగించనూ లేవు.'' ఆమె ఏ భావమూ ప్రతిబింబించని ముఖంతో ఉండిపోయింది.

''నాకు బాధ్యతలున్నాయి- నాజీవితం పట్లతో

సహా. నేనేమీ ధనవంతుణ్ని కాను. వారానికోసారయినా యీ బార్‌కి రానివ్వదు నా ఆర్థిక పరిస్థితి. ఐనా నాకు తాగుడంటే యిష్టమేమీ కాదు.''

''మరి..''

''ఆరు నెలలపాటు ఎలా వొచ్చానినా? ఉద్యోగం చేసే చోట అప్పులు...తెలిసిన చోట..తెలిసిన వారి నుంచి..అందిన మేరకు అప్పులు..అంతవరకూ ఉండే వాచీలాటి వస్తువులు అమ్మేసి సొమ్ము చేశాను. దేనికి? తాగడం కోసం..యీ బారుకి రావడం కోసం..ఆ రావడమెందుకు? నీ కోసం. నిన్ను చూసుకోడం కోసం..నీతో పొడిమాటలయినా ఆడడం కోసం! నేనీబార్‌కి వొచ్చిందీ, తాగిందీ నిజంగా నిషా కోసం కాదు. నీకోసం! రోజ్! నీకోసం!

అందాలతెలతో ఆటలాడుకొనేరకు-చిత్రలేఖన విద్య నేర్చితిని నేను; అంటాడు గాలిబ్. అలాగ ప్రేమకోసం నీ కోసం తాగాను తప్ప-నిషా కోసం కాదు. ఇదీ నిజం. నువ్వు నన్ను ఏనాటికీ ప్రేమించనప్పుడు నాకీ మధువెందుకు? ఈ బార్‌కి రావడ మెందుకు? నీ ప్రేమసట్ల నిరాశ.. నిస్పృహలు కలగడంతో నాకు వైరాగ్యమూ వొచ్చేసింది. వాస్తవ జీవితంలోకి కళ్లూ తెరుచుకున్నాయి. ఇలాగే అప్పులు చేస్తూ పోతే నా ఉద్యోగం పోడానికీ నేను పూర్తిగా మునిగిపోడా నికీ యిక ఆట్టే కాలం పట్టదు. ఇంకా వరం దొరకని యీ ప్రేమ తపస్సుని కొనసాగించడం నా వల్ల కాదు. అది నా ఆర్థిక శక్తికి మించిన పనే.

జీవితం అందరిదీ..కాని. ప్రేమ వరం కొందరికే. నాకా అదృష్టం రాసి పెట్టిలేదు. ఐనా నేను జీవించాలి. నాకోసం నన్ను నమ్ముకున్న అమ్మకోసం. ప్రేమలేని జీవితం ఎడారే ఔగాక. తప్పదు. ప్రేమకోసం జీవితాన్నే త్యాగం చేసుకోగల స్వేచ్ఛనాకు లేదు. ఎందుకంటే..మా అమ్మకు నా అనేవాణ్ణి నేనొక్కణ్ణే.

నీకున్నా లేకపోయినా...నువ్వా మోదించినా మానినా, నాకు నీతో అనుబంధం..ఆరు నెలల అనుబంధం. ఇన్నాళ్ల పరిచయం అనంతరం-అది కస్టమరూ బార్ టెండర్ల సంబంధమే అయినా...నీతో చెప్పకుండా హఠాత్తుగా మాయమైపోడానికి నాకెందుకో మనస్కరించలేదు. అందుకే చెప్పి వెళ్దామని..వీడ్కోలు తీసుకుందామని..చివరిసారిగా వొచ్చానివాళ. వొచ్చిన పని అయింది. థాంక్యూ రోజ్..గుడ్ బై ఫరెవర్..''

అతని కంఠంలో గద్గదికత..

ఆమె-వాచీ చూసుకుని-

''ఒక్క నిముషం..మీరు నా నుంచి వీడ్కోలు తీసుకుందుకు శ్రమ తీసుకు వచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. ఐతే..యిప్పటికీ మీలో కొన్ని అపార్థాలు మిగిలిపోయాయని మీ మాటల నుంచి అర్థమైంది. వాటికి నివారణ యివ్వవలసిన బాధ్యత నాకుంది. మీ మద్యపానం గురించి నిజంగానే నేను భ్రమలో ఉండిపోయి..మీరెందుకలా తాగుతున్నారో తెలియక..వొట్టి తాగుబోతుగానే భావించాను. నిజమే. మీరు బార్‌లోకి రావడం కంట పడగానే నా ప్రమేయం లేకుండా నా ముఖం ముడుచుకునేది. ఇంకొకటి కూడా నిజమే. నేను మీకు మాత్రం ఎప్పుడూ మనస్ఫూర్తిగా డ్రింక్ సర్వ్ చేయలేదు. మీ ఒక్కరి ముందూ మాత్రం నా డ్యూటీని మరచిపోయేదాన్ని. నేను-మీరు తప్ప మిగిలిన కస్టమర్లందరికీ మంచి బార్‌టెండర్‌నే. అంగీకరిస్తాను. మీ పట్ల నా ప్రత్యేక ప్రవర్తనని..''

''అంగీకరించినందుకు చాలా థాంక్స్. కాని, ఎందుకో కూడా చెప్పేస్తే..నేను వెళ్లిపోతాను..బార్ మూసేవేళ కూడా అయింది.''

''చెబుతాను. ఇప్పుడు కాకపోతే మరెప్పటికీ అవకాశం రానేరాదేమో..కాని..యిక్కడ కాదు..బయటకు పదండి.'' అని అతని చేయిపట్టుకుని మరీ నడిపించసాగింది.

క్యాష్ కౌంటర్‌లో కూర్చున్న బారు యజమానితో సహా అక్కడున్న కొద్దిమందీ-''తెగ తాగేసేడు కాబోలు. రోజ్ స్వయంగా బయటకు సాగనంపుతోంది..మంచిగా..!''

అనుకున్నారే తప్ప అన్యథా భావించలేదు. ఔను. నిప్పులాటి ఆమె గురించి వారందరికీ బాగా తెలుసుమరి.

ఆమె అతనూ రోడ్డుమీదకి వచ్చారు. అక్కడ-వెన్నెలతో చల్లగా..హాయిగా..అందంగా ఉంది.

''మాధవ్! ఇక ఎన్నడూ తాగనని ప్రమాణం చేస్తే..చెప్పేస్తాను నా కారణం.'' అందామె.

''ఇందాకే చెప్పాను, యిన్నాళ్లు తాగినా నాకది అలవాటు కాలేదనీ..యిష్టం కాదనీ..తలుచుకున్న క్షణం నుంచీ తాకకుండా ఉండగలననీ..అయినా ప్రమాణం చేస్తున్నాను-జీవితంలో మరిక తాగను. ఏ బారులోకీ అడుగుపెట్టను. చాలా? చెప్పిప్పుడు.''

''తొలిసారిగా మీరు నన్ను చూసి ప్రేమలో పడ్డట్టే..నేనూ మిమ్మల్ని చూడగానే..మనసు పారేసుకున్నాను.'' సిగ్గుపడుతూ చెప్ప సాగింది. ''మిమ్మల్ని ప్రేమించాను కనుకనే- మీరు బార్‌లోకి రావడమూ, తాగడమూ నాకు కంటకంగా ఉండేది. ప్రేమించినవారు తప్పతాగడం ఏ స్త్రీ భరించగలదూ? అతని పతనాన్నెలా సహించగలదూ?''

''రోజ్!'' అతను ఆనందం పట్టలేక పోయాడు. అప్పటికే ఆమె అతని చేతుల్లోకి వచ్చేసింది.

''నా ఉద్యోగంలో..జీతంలో..మనం బాగానే బతకొచ్చు రోజ్. మా అమ్మకి నీ గురించి నాకు తెలిసిందంతా చెప్పడమూ జరిగింది, అమె నిన్ను తన కోడలిగా అంగీకరించడమూ జరిగింది. మనం-రేపే పెళ్లి చేసుకుందాం ఏ గుళ్లోనో. కాని..''సందేహిస్తున్నట్లాగాడు.

''ఏమిటి?''

''నువ్వు కూడా యికపై బార్‌కి రానొద్దు. అహ..మరెందుకో కాదు.. నాలాటివాళ్లు యింకా తయారవకుండా మా..మరీ అవసరమైతే యింకో ఉద్యోగం చెయ్యొచ్చులే.''

''అలాగే.'' నవ్వేసిందామె అతని చేతిని మృదువుగా నొక్కుతూ. తమ వెనుక చిత్రమైన కథ గల ఆ ప్రేమ జంటను ఆశీర్వదిస్తున్నట్లూ అభినందిస్తున్నట్లూ-చందమామ మబ్బు పొరలని తొలగించుకు వొచ్చి మరీ వెన్నెల కురిపించసాగాడు. చందమామకు ప్రేమలన్నా ప్రేమికులన్నా చెప్పలేనంత యిష్టం కదా

★



## డబ్బే లోకం!

అమితాబ్ నటిస్తున్న 'లాల్‌బాద్‌షా' సినిమాకి సంబంధించిన పబ్లిసిటీ ఓ వైపు జరిగిపోతుంటే మరోవైపు షూటింగ్ ఆగిపోయి ఏం చెయ్యాలో తెలీక జుట్టు పీక్కుంటున్నాడు దర్శక నిర్మాత కె.సి.బొకాడియా. తనకి రావాల్సిన మిగతా పారితోషికం అంతే వరకూ షూటింగ్‌కి రానని మనిషా కొయిరాలా నిక్కచ్చిగా చెప్పేయడంతో ఈ పరిస్థితి వచ్చిపడిందట. అమితాబ్ హీరో అయినా, బొకాడియా డైరెక్టరయినా అవేం చెల్లవు, కాసులు పడ్డాకే షూటింగ్ అని మనిషా మొండికేసిందట. ఈలోగా టైమ్ వేస్ట్ చేయకుండా తీసిన సినిమా భాగం తాలూకు డబ్బింగ్ పని చేద్దాం అని ఆలోచిస్తున్నాడు బొకాడియా. ఏం చేస్తాడు మరి! అంతా డబ్బుతోనే లోకం!

-జి.ఎం.